సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


భవానీపురంలో జరిగిన అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ రెహమతున్నీసా


జక్కంపూడి కాలనీలో అవగాహన ర్యాలీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): వాతావరణంలో మార్పుల కారణంగా సంభవించే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా కోరారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంపై శుక్రవారం డివిజన్ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రెహమతున్నీసా ఇంటింటికీ వెళ్లి ఫ్రైడే..డ్రై డే గురించి వివరిస్తూ ప్రతి శుక్రవారం ఇల్లు, పరిసర ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. పాడైపోయిన టైర్లు, వాడేసిన కొబ్బరి బొండాలు, నీళ్ల తొట్టెలు/డ్రమ్ముల్లో ఉన్న నీటిని పారబోసి శుభ్రం చేసుకోవాలని సూచించారు. నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంటే దోమలు ఉత్పత్తి అయ్యి మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు వస్తాయని పేర్కొన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తీసుకోవాలని తెలిపారు. శానిటరీ సిబ్బంది పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

నీటి సరఫరా విభాగం అధికారులు, సిబ్బంది ఓవర్ హెడ్ ట్యాంకలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ బ్లీచింగ్ పౌడర్‌తో క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ శివరామప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

లార్వాను నిర్మూలించాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి పరిసరాల్లో పనికి రాని సామగ్రిలో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు దోమల లార్వా పెరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు పేర్కొన్నారు. ఫ్రైడే-డ్రైడేను పురస్కరించుకుని జక్కంపూడి కాలనీ గొల్లపూడి-5 సచివాలయం పరిధిలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాలనీలోని కమ్యూనిటీ హాల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పలు ప్రాంతాల్లో సాగింది. ఈ సందర్భంగా దోమల లార్వా వృద్ధి చెందే ప్రాంతాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శిరీష మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో రెండు బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే చేస్తామన్నారు. ర్యాలీలో మలేరియా ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే రాంబాబు, సబ్ యూనిట్ సిబ్బంది, ఆషా, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింల ద్రోహి చంద్రబాబు

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశంలోనే ముస్లింల అతిపెద్ద ద్రోహి చంద్రబాబునాయుడు అని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షేక్ ఆసిఫ్ విమర్శించారు. పార్లమెంట్‌లో వక్ఫ్ బోర్డుకు సంబంధించి ముస్లింలకు వ్యతిరేకంగా టీడీపీ మద్దతు తెలపటం దుర్మార్గమన్నారు. టీడీపీ ప్రతి అడుగులోనూ ముస్లింలను అణగదొక్కటమే లక్ష్యంగా ఉందన్నారు. గతంలో ముస్లింలకు రాజశేఖరరెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్లను కల్పిస్తే దానిని వ్యతిరేకించి కోర్టులో కేసులు వేయించిన దుర్మార్గుడు చంద్రబాబు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు నారా హమారా కార్యక్రమంలో ముస్లింలకిచ్చిన వాగ్దానాలపై ప్రశ్నించిన ముస్లిం యువతపై దేశద్రోహులుగా కేసులు బనాయించారని గుర్తు చేశారు. వక్ఫ్‌బోర్డుకు సంబంధించి పార్లమెంట్‌లో జరుగుతున్న అంశాన్ని యావత్ ముస్లిం సమాజం వ్యతిరేకిస్తున్నా టీడీపీ మద్దతు ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు.

బీజేపీతో కలిసి ముస్లింలను అణగదొక్కడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తున్న చంద్రబాబును ప్రజలు క్షమించరని పేర్కొన్నారు. ముస్లింల అభ్యున్నతికి అండగా నిలుస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో.. బీజేపీ సాగిస్తున్న కుట్రలను సైతం ఎదుర్కొంటామని పేర్కొన్నారు.

ప్రజల గుండెల్లో జగనన్న

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శరత్



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరం నడిబొడ్డున ఉన్న సామాజిక మహాశిల్పం బోర్డు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు ధ్వంసం చేసిన పచ్చమూకలు ప్రజల గుండెల్లో నిండి ఉన్న జగనన్న రూపాన్ని చెరపగలరా అంటూ వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల శరత్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలు, ఆయన పేరు ఉన్న బోర్డులపై అక్షరాలను టీడీపీ గూండాలు ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని స్మృతివనంలో అంబేడ్కర్ విగ్రహం కింద ఉన్న ఆయన పేరున్న అక్షరాలను ధ్వంసం చేయడం అప్రజాస్వామిక చర్య అని, ప్రజాస్వామ్యవాదులంతా ఘటనను ఖండించాలని కోరారు. ఈ దుర్ఘటన జరిగిన ప్రాంతం చుట్టూ పోలీస్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్, కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ ఉన్నా తెలుగుదేశం మూకలు రెచ్చిపోయాయంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయో అర్థమవుతుందని పేర్కొన్నారు. విషయం బయటకు పొక్కకపోతే అంబేడ్కర్ మహనీయుని విగ్రహాన్ని కూడా ధ్వంసం చేయడానికి వెనకాడేవారు కాదని పేర్కొన్నారు. స్మృతివనంలో లైట్లన్నీ ఆర్పేసి జగనన్న పేరుగల స్టీల్ అక్షరాలను సుత్తులతో ధ్వంసం చేశారంటే అధికారులకు తెలియకుండా జరిగే అవకాశం లేదని పేర్కొన్నారు. విధ్వంసకాండకు పాల్పడిన పచ్చమూకల వెనుక ఎవరు ఉన్నారనేది ప్రజలకు స్పష్టత ఉందని తెలిపారు. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని చంద్రబాబు, పవన్ గ్రహించాలని కోరారు. అధికారాన్ని ఇచ్చింది విధ్వంసానికి కాదని, కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదని తెలిపారు.

వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడం సరికాదు

వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కొత్తగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగిస్తామని చంద్రబాబు ప్రభుత్వం చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ అన్నారు. రాష్ట్రానికి 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ఒక్క వైద్య కళాశాల కూడా ఏర్పాటు చేయలేదని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో ఏకంగా 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తే వాటిని ప్రైవేటుకు ఇస్తామనడం ఇదేనా సంపద సృష్టి అంటే అని ప్రశ్నించారు. నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ తొలిదశలో ఐదు వైద్య కళాశాలల్లో 750 సీట్లు అడ్మిషన్లు జరపగా, వాటిలో కొన్నింటిని సెల్ఫ్‌ఫైనాన్స్ సీట్లు పెడితే నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ వైద్య సీట్లు అమ్ముకుంటున్నారని దుష్ప్రచారం చేశారన్నారు. ఇప్పుడు చంద్రబాబు, లోకేష్ ఏకంగా వైద్య కళాశాలలనే ప్రైవేటుకు అప్పగించే వ్యాపారాన్ని వాళ్లు ప్రారంభించారని మండిపడ్డారు. ఈ వ్యవహారంతో వారి నిజస్వరూపం బయటపడిందన్నారు. ఇలా అబద్ధాలు ఆడటం, నమ్మకంగా నటించి మోసం చేయడం, మాట మార్చడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. ఎన్నికల ముందు సంపద సృష్టి అన్నారని, పేదలను ధనవంతులను చేస్తానని చంద్రబాబు చెప్పారన్నారు. ఇప్పుడు ఏకంగా ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. దీని ద్వారా ప్రభుత్వాస్పత్రుల్లో సేవలపై యూజర్ చార్జీలు వసూలు చేస్తామని చెప్పడం చూస్తే ఇదేనా మీ విజన్, ఇదేనా మీ పూర్ టు రిచ్ కాన్సెప్ట్ అర్థం అని ప్రశ్నించారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీకి మంగళం పాడే విధంగా టీడీపీ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని, ఇలా వైద్య రంగాన్ని ప్రైవేటీకరించి పేదలను దోచుకునే విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు.

నిష్కల్మష జీవితాలకు సాక్ష్యాలు ఆదివాసీలు

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రకృతిని నమ్ముకుని జీవించే నిష్కల్మష హృదయులైన ఆదివాసీయులకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సమష్టి జీవన పద్ధతులు, పరస్పర సహకారం, ప్రాచీన చరిత్రకు, సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే జీవన శైలి ఆదివాసుల సొంతమని పేర్కొన్నారు. అడవులు, ప్రకృతిని కాపాడుతూ చక్కటి జీవనం సాగించే ఆదివాసీల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేష కృషి చేసిందని తెలిపారు. దేశానికే ఆదర్శంగా ఆదివాసీ అభివృద్ధి కార్యాచరణను అమలు చేశామని.. గిరిజనులకు ప్రాధాన్యమిస్తూ రెండు జిల్లాలను ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. గిరిపుత్రులు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండేలా చూడాలని అడవి తల్లిని కోరారు.

అనువాదాలతో సాహిత్యం విశ్వవ్యాప్తం కావాలి


కవితా సంపుటి ఆవిష్కరణ సభలో మండలి బుద్ధప్రసాద్, గుమ్మా సాంబశివరావు

విజయవాడ కల్చరల్: అనువాదాలతో సాహిత్యం విశ్వవ్యాప్తం కావాలని ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ పీఠం ఆధ్వర్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ రచించిన కవితా సంపుటి మహాశూన్యం అదే పేరుతో హిందీలోకి అనువదించిన కవితా సంపుటి ఆవిష్కరణ సభను గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్లో శుక్రవారం ఆవిష్కరించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగునేల మీద అనువాదకుల కొరత ఉందన్నారు. సభాధ్యక్షుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు.. కవితా సంపుటి అనువాదకుడు డాక్టర్ వెన్నావల్లభరావు సాహిత్యసేవలను వివరించారు. తొలి ప్రతిని గోళ్ల నారాయణరావు స్వీకరించారు. సమావేశంలో రచయిత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్, హిందీ భాషావేత్తలు కొచ్చర్లకోట వెంకట సుబ్బారావు, పేరిశెట్టి శ్రీనివసరావు, డాక్టర్ మద్దాల జయలక్ష్మి, కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు, సమతాసేవా సమితి కార్యదర్శి చింతా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏపీ సర్వోదయ మండల్ నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న సర్వోదయ మండల్ నూతన కార్యవర్గం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ సర్వోదయ మండల్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గాంధీనగర్‌లోని కందుకూరి కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్.రాంబాబు నాయుడు, ఉపాధ్యక్షులుగా వల్లూరు లత, ఎ. రవితేజ, కె.వరప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డి.దీనబంధు, కోశాధికారిగా వై.సురేష్ బాబు, సహాయ కార్యదర్శులుగా డి.ఆశాజ్యోతి, పి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, ఎం.రాజేంద్రప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా జి.రవికుమార్, గంగవరపు ప్రదీప్ దాస్, వై.సత్యేంద్ర రెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎస్.రాంబాబు నాయుడు మాట్లాడుతూ.. అఖండ భారతావనిలో శాంతి పరిఢవిల్లాలని జాతిపిత మహాత్మా గాంధీ పిలుపు మేరకు వినోభాబావే సర్వసేవా సంఘ్, సర్వోదయ మండల్‌ను ప్రారంభించారన్నారు. సర్వ సేవా సంఘ్ అనుబంధ సంస్థగా ఏపీ సర్వోదయ మండల్ ఏర్పాటైందని తెలిపారు. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ప్రజాహితం కోసం ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండల్ పనిచేస్తోందన్నారు.

మార్కెట్‌లోకి నిస్సాన్ ఎక్స్ ట్రయల్


వి నిస్సాన్ ఎక్స్-ట్రయల్‌ను విడుదల చేస్తున్న పాములపాటి కిరణ్

పటమట(విజయవాడతూర్పు): నగర మార్కెట్‌లోకి కొత్త నిస్సాన్ ఎక్స్- ట్రయల్ 7 సీటర్ కారు విడుదలైంది. బెంజిసర్కిల్ సమీపంలోని ఎక్స్‌ప్రెస్ నిస్సాన్ షోరూంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పాములపాటి కిరణ్ మాట్లాడుతూ ఈ కారు అత్యాధునిక ఫ్యూచర్స్ కలిగి ఉందని, వీసీ టర్బో ఇంజన్, 360 డిగ్రీల కెమెరా, పనోరమిక్ ఎలక్ట్రికల్ సన్‌రూఫ్, 7 ఎయిర్‌బ్యాగ్స్, ఆల్ వీల్స్ డిస్క్ బ్రేక్స్‌తో మూడు రంగుల్లో లభిస్తుందని, బుకింగ్స్ ప్రారంభమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కోనేరు శ్రీధర్, డాక్టర్ అట్లూరి పల్లవి, అట్లూరి అనీత్, షోరూం జనరల్ మేనేజర్ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ హౌసింగ్‌బోర్డ్ కాలనీ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఎంఐజీ-2 బ్లాకులు, పోలీస్ స్టేషన్ రోడ్, వీఎంసీ కల్యాణమండపం ఏరియా, హెచ్‌ఐజీ బ్లాకులు, రిలయన్స్ ఫ్రెష్, హెచ్‌ఆర్‌టీ సాయి నిర్మాణ్ పరిసర ప్రాంతాలు, అమృత్ అపార్ట్‌మెంట్ రోడ్, టీచర్స్‌కాలనీ, అప్పాబజార్ రోడ్, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, దర్గా ప్లాట్లు, 450 ఎస్ఎఫ్‌టీ బ్లాకులు ప్రాంతాలలో కరెంట్ నిలిపి వేయనున్నట్లు వివరించారు.

'వించిపేట' నాయాబ్ ఖాజీగా ఫరీబ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గ వించిపేట ప్రాంతానికి నాయాబ్ ఖాజీగా మొహమ్మద్ ఫరీబ్ మఖబీ నిజామిని నియమించినట్లు సిటీ ఖాజీ అబ్దుల్ ఖదీర్ చిష్టీ తెలిపారు. వించిపేట ప్రాంతంలో వివాహాది కార్యక్రమాలకు ఫరీబ్‌ను సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జువెనైల్ హోమ్‌లో పిల్లలకు ఉపాధి అవకాశాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిన్నతనంలో తెలిసీ తెలియక చేసిన తప్పుల కారణంగా జువెనైల్ హోమ్‌లో ఉంటున్న పిల్లలకు స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వై.సుజనాచౌదరి పేర్కొన్నారు. విద్యాధరపురం కబేళా రోడ్డులోని ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహాన్ని (జువెనైల్ హోమ్) ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోమ్‌లోని సమస్యలు, మౌలిక సదుపాయాలపై సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలలతో మాట్లాడి వారి బాగోగులపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ పిల్లలు హోమ్‌లో ఉన్నంత కాలం వారికి క్రమశిక్షణతో కూడిన మంచి బుద్ధులను నేర్పించాలని ఆదేశించారు. హోమ్‌లో మంచి నడవడిక కలిగిన పిల్లలను దత్తత తీసుకునే ఆలోచన చేస్తామని చెప్పారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రావణమాసం తొలి శుక్రవారం కావడంతో 'పశ్చిమ'లో ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం (పాత శివాలయం)లో భ్రమరాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని భద్రకాళి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో ఖడ్గమాలార్చన చేశారు.

వెంకన్న సన్నిధిలో..

బ్రాహ్మణ వీధి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం పద్మావతి అమ్మవారికి విశేష అలంకారం, ప్రత్యేక కుంకుమార్చన చేశారు. గోదాదేవికి ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమాలను పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి నిర్వహించారు.

మహిళలకు క్యారేజీ బాక్సుల పంపిణీ


గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సినీ హీరో సూపర్‌స్టార్ మహేష్ బాబు పుట్టిన రోజు సందర్భంగా ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు క్యారేజీ బాక్సులు పంపిణీ చేశారు. లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీ షిర్డీనాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో శుక్రవారం అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాస్వామి మాట్లాడుతూ ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది మహిళలకు క్యారేజీ బాక్సులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మహేష్ బాబు అభిమానులు విజయ్, శ్రీరాజు, ధనుంజయ, సాయి, కోటయ్య, టైలర్ తదితరులు పాల్గొన్నారు.

160 మందికి ఉచితంగా పాస్‌పోర్టుల రిజిస్ట్రేషన్

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉచిత పాస్‌పోర్టు మేళా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మాట్లాడుతూ కార్యక్రమంలో 160 మందికి ఉచితంగా పాస్‌పోర్టులు రిజిస్ట్రేషన్ చేశామని చెప్పారు. ఇంకా ఎవరైనా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే 78099 55599 నంబర్‌ను సంప్రదించాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ల జిరాక్స్, ఆధార్ కార్డు తీసుకురావాలని చెప్పారు.

జల సవ్వడి
జన సందడి







ప్రకాశం బ్యారేజీ వద్దకు చేరిన వరద నీటిని దిగువకు వదలడంతో.. ఈ ప్రాంతాల్లో సందర్శకుల సందడి అధికంగా కనిపించింది. అనేక మంది బ్యారేజీ వద్ద దిగువకు పారుతున్న నీటిని తిలకిస్తూ సెల్ఫీలు దిగారు. వరద నీటి పారుదలను సెల్ ఫోన్లతో వీడియోలు తీశారు. సందర్శకులు అధిక సంఖ్యలో రావడంతో బ్యారేజీ వద్ద ట్రాఫిక్ నిలిచింది. ఈ దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



మహిళల ఆర్థికాభ్యున్నతికి కృషి


భవానీపురంలో కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళలు ఆర్థికంగా అభ్యున్నతి సాధించాలని పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) అన్నారు. భవానీపురంలోని ఎన్డీఏ కార్యాలయంలో శుక్రవారం రోటరీ విజయవాడ మిడ్ టౌన్, రోటరీ విజయవాడ శ్రీదుర్గ సంయుక్త ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ చేతుల మీదుగా 100 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొందాలన్న సంకల్పంతో కోల్ ఇండియా లిమిటెడ్ సీఎస్ఆర్‌లో భాగంగా కుట్టు మిషన్లను అందించడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ రావూరి వెంకటసుబ్బారావు, చైర్మన్ గొడుగు కృష్ణారెడ్డి, గుడిపాటి కిషోర్, కె.వి. శ్రీనివాసరావు, స్మార్ట్ ఆంధ్ర ఫౌండేషన్ శివ శంకర్ రావు, పలువురు నేతలు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఆవరణలో శ్రీలక్ష్మీ కూచిపూడి బృందం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. శుక్రవారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై చిన్నారులు అమ్మవారి కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

12న 'ఆచంట' కాంస్య విగ్రహం ఆవిష్కరణ

విజయవాడ కల్చరల్: రంగస్థల నటుడు ఆచంట వెంకటరత్నం నాయుడు కాంస్య విగ్రహాన్ని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఈ నెల 12వ తేదీ సోమవారం ఆవిష్కరిస్తున్నట్లు కాంస్య విగ్రహ కమిటీ ఉపాధ్యక్షుడు గోళ్ల నారాయణరావు చెప్పారు. కమిటీసభ్యులు గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ తెలుగు తేజం ఆచంట వెంకటరత్నంనాయుడు చేసిన సేవలను భావితరాలకు తెలియజేయడానికి విగ్రహం ఏర్పాటు చేశామని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆవిష్కరిస్తారని తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కమిటీ ఉపాధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ కవులు, కళాకారులను గౌరవించుకోవడం మన కనీస బాధ్యత అన్నారు. విగ్రహ కమిటీ కార్యదర్శి బాలాజీనాయుడు, కమిటీ సభ్యుడు హరగోపాల్, కమిటీ అధ్యక్షుడు అంబటి మధుమోహన కృష్ణ, రావి వెంకట్, కంది గంగాధర్ పాల్గొన్నారు.

సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: నా నేస్తం మ్యూజికల్ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం సినీ నటుడు మహేష్‌బాబు జన్మదిన వేడుకలను, సినీ సంగీత విభావరి నిర్వహించారు. సీనియర్ గాయకుడు డేవిడ్ రాజు మాట్లాడుతూ నటుడిగా మహేష్‌బాబు ఉన్నత శిఖరాలకు చేరుకున్నట్లు తెలిపారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చిట్టిబాబు మాట్లాడుతూ సూపర్‌స్టార్ కృష్ణ వారసుడిగా అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించినట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ మహేష్‌బాబు లక్షలాది అభిమానులను సంపాదించుకున్నట్లు చెప్పారు. విశ్రాంత ఆకాశవాణి కార్యక్రమ నిర్వాహకుడు ఆనంద్ నిర్వాహకుల కృషిని అభినందించారు. కృష్ణసింధు, మహేశ్వరి, రాధానాయుడు, భావన, విజయదుర్గ, పలు చిత్ర గీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను సత్కరించారు.

ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠా మహోత్సవం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురంలో జై సంతోషిమాత ఆలయ ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం శుక్రవారం కనుల పండువగా జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్ని చిట్టిబాబు ఆధ్వర్యంలో దెందుకూరి శ్రీకాంత్‌శర్మ నేతృత్వంలో అర్చక స్వాముల వేద మంత్రోచ్చరణల నడుమ వైభవంగా నిర్వహించారు. ధ్వజస్తంభ శిఖర దాతలు నూజివీడుకు చెందిన పోతుల వెంకట నాగ రాజశేఖర్ దంపతుల చేతుల మీదుగా శిఖర ప్రతిష్ఠ జరిగింది. అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం 5వేల మందికి అన్నదానం చేశారు.